క్లుప్తంగా

విద్యార్థినికి చేయూత



కోడేరు: మండలంలోని జనుంపల్లికి చెందిన ప్రత్యూష సూర్యాపేటలోని మెడికల్ కళాశాలలో సీటు సాధించడంతో ఎంవీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్‌యాదవ్ విద్యార్థిని అభినందించి రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి మండలానికి మంచి గుర్తింపు తేవాలని కోరారు. అనంతరం జనుంపల్లికి చెందిన బుక్కు కీపర్ దామోదర్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.6వేలు, ఎల్లమ్మ కుటుంబానికి రూ.5వేలు, మద్దిలేటి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

అభివృద్ధిని చూసి చేరికలు



తెలకపల్లి: మండల పరిధిలోని కార్వంగకి చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎంపీపీ కొమ్ము మధు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు ఈదుల నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన 40 మంది యువకులు మంగళవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నామన్నారు.

విధులకు ఆటంకం.. వ్యక్తికి రిమాండ్

కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన కుర్మయ్య గత నెల 26, 28, ఈనెల 2న పది సార్లు డయల్.100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు పోలీసులతో దురుసుగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేసి 14రోజులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఎవరైనా అనవసరంగా 100కు ఫోన్ చేసి విధులకు ఆటంకం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కమిటీ సమావేశాలు



తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా కమిటీ సమావేశం నిర్వహించారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సోషల్ మీడియా నాయకులు అభిమన్యు, గౌరీ కుమార్, జలీల్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాల్గొన్న వారందరికి సంబంధించిన బయోడేటా ఫాంలు అందజేశారు.

నేడు ధర్నా

మన్ననూర్: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీఆర్‌ఎస్ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మన్ననూర్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థిని నిఖిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై నిజాలు నిగ్గు తేల్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుతంగా డిమాండ్ చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి నాయకులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడం అమానుషమని అన్నారు. సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కి పట్టడం హేయమైన చర్యగా ఉందని ఆయన దుయ్యబట్టారు. లాఠీఛార్జీని ఖండిస్తూ, బాధిత కుటుంబానికి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్థిక సాయం

చారకొండ: మండలంలోని గోకారం ఉప సర్పంచ్ బోడ్డుపల్లి భాస్కరాచారి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూపల్లి వెంకటయ్య యాదవ్ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ఎన్‌జేవై ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ సీనియర్ నాయకుడు, ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి నివాళులర్పించారు.

పరామర్శ

కల్వకుర్తిరూరల్: వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి పరామర్శించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి రెండు రోజుల క్రితం చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ మేరకు మంత్రిని పరామర్శించడంతో పాటు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



జిల్లాకేంద్రంలో రంగులు చల్లుకుంటున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్



అచ్చంపేటలో మహిళలు



జాగృతి ఆధ్వర్యంలో..



కల్వకుర్తిలో హోలీ వేడుకల్లో వనితలు

రంగుల వేడుక.. ఆనందాల డోలిక

జిల్లావ్యాప్తంగా మంగళవారం హోలీ వేడుకలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. బిజినేపల్లి, తిమ్మాజీపేట, వెల్దండ, దోమలపెంట, అమ్రాబాద్, తెలకపల్లి, ఉప్పునుంతల, అచ్చంపేట, లింగాల, పెంట్లవెల్లి, కొల్లాపూర్, కోడేరు, చారకొండ, తాడూరు, కల్వకుర్తి మండల కేంద్రాలతోపాటు పల్లెలు, పట్టణాల్లో.. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకొన్నారు. కొందరు ప్రత్యేకంగా డీజేలు ఏర్పాటు చేసుకుని ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పైకి పెద్దసంఖ్యలో యువత చేరి రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొట్టారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన హోలీ వేడుకల్లో కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్ ఒకరికొకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. గిరిజన తండాల్లో హోలీ పండుగ మరింత ఉత్సాహంగా జరిగింది. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



నాగర్‌కర్నూల్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికులు



జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



పెంట్లవెల్లిలో హోలీ ఆడుతున్న యువకులు



కొల్లాపూర్‌లో హోలీ సంబరాలు



కోడేరులో హోలీ వేడుకల్లో యువకులు



అచ్చంపేటలో చిన్నారులు



రంగులతో చిన్నారి



బలాన్‌పల్లిలో కాముడి దహనం



వెల్టూర్‌లో హోలీ ఆడుతున్న యువకులు, విద్యార్థులు



నాగర్‌కర్నూల్‌లో నృత్యాలు చేస్తున్న యువకులు



ఈగల పెంటలో భూగర్భ కేంద్రం సీఈకి హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న గిరిజన ఇంజినీర్లు, ఉద్యోగులు



జిల్లుపల్లిలో హోలీ వేడుకల్లో యువకులు



బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో హోలీ వేడుకలు



వెల్దండ మండలం బైరాపూర్‌లో..



లట్టుపల్లిలో..



తిమ్మాజీపేట మండలంలోని అప్పాజీపల్లిలో..

వైభవంగా గంగా మంత్రాలమ్మ నెలపూజ

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- అమ్మవారికి బోనాలు, గొర్రె పొట్టేళ్లు సమర్పించిన మహిళలు



ఉత్సవాల్లో భక్తుల సందడి

కోడేరు: మండలంలోని జనుంపల్లి గ్రామ శివారులో వెలిసిన గంగా మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం నెల పూజ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాలు చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున మంత్రాలమ్మను దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి బోనం కుండలు, కోళ్లు, గొర్రె పొటేళ్లు, కొబ్బరికాయలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

మహిళలకు సన్మానం

అచ్చంపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని వినాయకనగర్ కాలనీలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళామణులను ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళలు మోక్తాల పద్మ, పార్వతి, రాగిణి, విజయలక్ష్మి, మల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, పల్లవి, రజిత, కళ్యాని, కౌసల్య, సత్యవతి, శ్రీదేవి, నందిని, అనిత, నాయకులు మోక్తాల వెంకటేష్, పర్వతాలు, పాండు, మల్లేష్, వెంకటయ్య, బాలస్వామి, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న నాయకులు

రోడ్డుపై కూరగాయల సంత!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల రోడ్డుపై మండల కేంద్రంలో కూరగాయల సంత ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళవారం మండల కేంద్రంలో కూరగాయల సంతతో పాటు పశువుల సంత, చేపల మార్కెట్ రోడ్డుపై ఉండడంతో మండల కేంద్రం నుంచి పెద్ద కార్పాముల, చిన్నకార్పాముల, చిన్నకొత్తపల్లి, యాపట్ల, లింగాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దకొత్తపల్లి బస్టాండ్ నుంచి ఎల్లమ్మ గుడి వరకు బీటీ రోడ్డుకు ఇరువైపుల సంత ఉండడంతో రోడ్డుపైనే వినియోగదారులు కొనుగోలు చేస్తూ నిల్చుంటారు. గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీసులు హెచ్చరించినా రోడ్డుపైనే సంతను ఏర్పాటు చేస్తూ విక్రయాలు చేపడుతున్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి నాగశేషిని వివరణ కోరగా బస్టాండ్ నుంచి పాత పోలీస్‌స్టేషన్ వద్దకు మార్చేందుకు కూరగాయల విక్రయదారులకు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. వచ్చే వారం నుంచి బస్టాండ్‌లో కూరగాయలు ఏర్పాటు చేస్తే స్టాళ్లను తొలగిస్తామని ఆయన తెలిపారు.



పెద్దకార్పాముల రోడ్డుపై ఉన్న కూరగాయల సంత

కనుల పండువగా కల్యాణం



స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం నారదగిరి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం పౌర్ణమి చతుస్థానార్చన కార్యక్రమం అనంతరం 10 గంటలకు తిరు కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం గ్రామంలోని స్వామి వారి తిరువీధుల్లో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారి రథాన్ని ఊరేగింపు చేశారు.

బీజేపీతోనే పట్టణ ప్రగతి సాధ్యం

కొల్లాపూర్ రూరల్: బీజేపీతోనే పట్టణ ప్రగతి సాధ్యమని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలే భరత్ చంద్ర అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన యువ సంఘటన యాత్ర మంగళవారం మండల పరిధిలోని అమరగిరికి చేరింది. ఈ సందర్భంగా భరత్ చంద్ర మాట్లాడుతూ కొల్లాపూర్ ఎమ్మెల్యేగా అనేక మంది మారారు తప్పా ప్రజల అవసరాలను ఏ నాయకుడు తీర్చలేదన్నారు. నేటివరకు అమరగిరికి రోడ్డు లేదని, రోడ్డు దెబ్బతిన్న పట్టించుకునే వారు లేరన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం, గంగం మల్లేష్, శివకృష్ణ, శ్రీను, చందు, వినోద్, రాము, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్ చంద్ర

తిండిగింజలు సరఫరా చేయాలి

మన్ననూర్: ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులపై ప్రజలకు అందించే నిత్యావసర సరుకుల్లో భాగంగా తిండి గింజలు సరఫరా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చౌకధరల ద్వార పేద ప్రజలకు బియ్యంతో పాటు గోధుమలు, పిండి, పామాయిల్, చింతపండు, పప్పు తదితర తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందజేసేవారని అన్నారు. బియ్యం మినహాయిస్తే ప్రస్తుతం గ్రామాల్లో గోధుమలు, కిరోసిన్ పత్తాలేవని అన్నారు. వంటగ్యాస్ ధరలు అధికం కావడం, నల్లమలలో అటవీ ప్రాంతం నుంచి ఫారెస్టు అధికారులు వంట చెరుకు కూడా తెచ్చుకునేందుకు అవకాశం ఇవ్వని కారణంగా పేద కుటుంబాలు ప్రతి నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పేదలకు నిత్యావసర సరుకులతో పాటు తిండి గింజలను సరఫరా చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో యజ్ఞాలు



ఆకునెల్లికుదురులో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

తాడూరు: మండలంలోని ఆకునెల్లి కుదురు రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పౌర్ణమి సందర్భంగా భక్తి శ్రద్ధలతో యజ్ఞాలు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని సిర్సవాడలో లక్ష్మీనరసింహ స్వామి ఆవరణలో పూజారి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో యజ్ఞాలు నిర్వహించి పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆకునెల్లికుదురులో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏటా పౌర్ణమి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించి బండ్ల ఊరేగింపు, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

ఉప్పునుంతల: మామిళ్లపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యహోమాలు, బలిహరణం నిర్వహించారు. రాత్రికి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామస్వామిగౌడ్ తెలిపారు.